ప్రజాశక్తి
శుక్రవారం 30 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

నువ్వలరేవు వంతెన నిర్వాసితులకు న్యాయం చేస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం నువ్వులరేవులో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణం పూర్తయి ఏళ్ల గడుస్తోందన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కారం కాకపోవడంతో రహదారి నిర్మాణం కాక వంతెన వినియోగంలోకి రావడం లేదని ఆయన అన్నారు. వంతెనఉన ఆనుకొని ఉన్న సుమారు 94 ఇళ్ల తొలగిస్తేనే రహదారి నిర్మాణం చేపట్టగలమని ఆయన అన్నారు. అనంతరం నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. 94 మంది నిర్వాసితులకు ఒకే చోట ఇళ్ల నిర్మాణం చేపడతామని, అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని మంత్రి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామస్తులు రహదారి పనులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘు, తహశీల్దార్ అప్పలస్వామి, విఆర్‌ఒ అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేనేతకు 'సహాయత'పై నీలినీడలు

చేనేత కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. వారిని ఉద్ధరించడానికేనంటూ గొప్పగా సర్వేలు చేసి ఆ తర్వాత మిన్నకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ హత్‌కర్గ్ సంవర్ధన సహాయత యోజన(హెచ్‌ఎస్‌ఎస్‌వై) పథకం ప్రస్తుతం అదే జాబితాలో చేరింది. చేనేత కార్మికులకు వివిధ రకాల పనిముట్లు అందించేందుకు గత ఏడాది నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసింది. ఏడాది గడిచినా కేంద్ర ప్రభుత్వం దాని ఊసెత్తడం లేదు. పథకం ద్వారా తమకు రాయితీపై పరికరాలు అందుతాయని ఎదురుచూస్తున్న కార్మికులకు నిరాశే మిగులుతోంది. పైగా క్లస్టర్ విధానం కొత్తగా తెరపైకి తీసుకురావడంతో ఎస్‌ఎస్‌ఎస్‌వైపై నిలినీడలు కమ్ముకున్నాయి.

- కార్మికుల కోసం హెచ్‌ఎస్‌ఎస్‌వై పథకంపై గతేడాది సర్వే
- ఏడాది గడుస్తున్నా సాయం ఊసెత్తని కేంద్రం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- క్లస్టర్ విధానంతో అమలుపై నెలకొన్న సందేహాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

నేత పనిలో నైపుణ్యం పెంపొందించి తద్వారా నాణ్యమైన ఉత్పత్తిని రాబట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో హత్‌కర్గ సంవర్ధన సహాయతా యోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది. పథకం ద్వారా చేనేత కార్మికులు అవసరమైన వర్క్‌షెడ్లు, మగ్గాలు, సోలారు విద్యుత్ దీపాలు, పలు రకాల మెషిన్లు, ఫ్రేమ్ లూమ్, తదితర పరికరాలను 90 శాతం రాయితీపై అందించనున్నారు. లబ్ధిదారుని వాటాగా పది శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. పరికరాలు అందజేతతో పాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. తొలుత తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలో దీన్ని అమలు చేసింది. గతేడాది ఎపిలో అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేశారు. అందులో భాగంగా జిల్లాలోనూ సర్వే చేశారు. వారిలో 860 మంది అర్హులుగా గుర్తించారు. వారికి 860 రకాల యూనిట్లు (పరికరాలు) అవసరమని తేల్చారు. వీటి విలువ రూ.4.03 లక్షల సొమ్ము కావాల్సి ఉందని ప్రతిపాదనలు పంపారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం 90శాతం వాటాగా రూ.3.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. లబ్ధిదారులు తమ వాటాగా రూ.1.09 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు నివేదిక పంపారు.

పథకం అమలుపై సందేహాలు

సర్వే చేసి ఏడాది గడిచినా సాయంపై కేంద్ర ప్రభుత్వం ఊసెత్తకపోవడంతో అసలు ఈ పథకం అమలవుతుందా? లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఈ పథకం ద్వారా అందిస్తున్న పరికరాలు, శిక్షణ మాదిరిగానే క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చింది. చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఒక క్లస్టర్‌గా పరిగణించి రూ.కోటి రూపాయలు కేటాయిస్తామని చెప్తోంది. కార్మికులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఇద్దరిని నియమిస్తారని అధికారులు చెప్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఆమదాలవలస మండలం అక్కులపేటలో దీన్ని అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు మూడేళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలుస్తోంది. అక్కులపేటతో పాటు మరికొన్ని క్లస్టర్ల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో పొందూరు-1 క్లస్టర్‌లోని 243 మంది లబ్ధిదారుల కోసం రూ.99.50 లక్షలు, పొందూరు-2 పరిధిలోని 220 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తోలాపి క్లస్టర్‌లో 111 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి శిక్షణ, పరికరాల కోసం రూ.92 లక్షలు అవసరమని నివేదించారు. క్లస్టర్ విధానంలో అన్నీ అందిస్తుండటంతో హత్‌కర్గ్ సంవర్ధన సహాయత యోజన పథకం ఇక ఉండదనే చర్చ సాగుతోంది.

సర్వే చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

హత్‌కర్గ్ సంవర్ధన సహాయతా యోజన పథకంపై జిల్లాలో గతేడాది నవంబర్‌లో సర్వే చేశాం. అర్హులైన వారిని గుర్తించాం. లబ్ధిదారులకు కావాల్సిన పరికరాలు, అందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పరికరాలు అందిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన క్లస్టర్ విధానంలో అదే రకమైన సాయమందిస్తోంది.

-ధర్మారావు,
చేనేత, జౌళి సంక్షేమశాఖ సహాయ సంచాలకులు

సాయం కోసం ఎదురుచూస్తున్నాం

నేతకు అవసరమైన పరికరాలు కోసం అధికారులకు చెప్పాం. కుంచె, అచ్చులు, పైని, పైపులు మగ్గానికి కావాల్సిన విడిభాగాలు అవసరమని అడిగాం. 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని చెప్పడంతో అందరమూ దరఖాస్తు చేసుకున్నాం. ఏడాది గడచినా ఇవ్వలేదు. ప్రభుత్వం ఇస్తుందని ఎదురుచూస్తున్నాం.

-బి.రాజేష్ పొందూరు

డబ్బులు ఇచ్చి కొనే పరిస్థితి లేదు

చేనేత కార్మికులకు కుంచె ప్రధాన వస్తువు. ప్రభుత్వం రాయితీపై చెప్పడంతో అంతా దరఖాస్తు చేసుకున్నాం. పరికరాలను డబ్బులు ఇచ్చి కొనే పరిస్థితి లేదు. సబ్సిడీపై ఇస్తే మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

-కనకం ప్రసాదరావు, పొందూరు

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

కార్మిక హక్కులు కాలరాస్తే
సహించేది లేదు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - రణస్థలం

కార్మిక హక్కులు కాలరాస్తే సహించేది లేదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర 16వ మహాసభల సందర్భంగా నిర్వహించిన కార్మిక చైతన్య బస్సు యాత్ర రెండో రోజు గురువారం రణస్థలంలో ప్రారంభమైంది. రామతీర్థాలు జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల పరిస్థితి గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా ఉందని, 15 ఏళ్ల నుంచి కనీస వేతనాలు సవరించలేదని, కనీస వేతనాల బోర్డును కూడా ప్రభుత్వం నియమించలేదని విమర్శించారు. కనీస వేతనాలు సవరించకపోవడం వల్ల నెలకు రూ.600 కోట్లకు పైగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నభోజన కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు పూనుకుంటోందన్నారు. వారికి గ్రాట్యుటీ, రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం అండతో వేతన ఒప్పందం చేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యూనియన్ పెట్టి హక్కులు సాధించుకోవడం సహించలేని యాజమాన్యం కార్మికులపై వేధింపులకు, అక్రమ తొలగింపులకు పాల్పడుతోందని విమర్శించారు. శ్యాంపిస్టన్స్, యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయని, ధరలు పెరుగుతున్నాయని, ధరలు ఆకాశానికి, జీతాలు పాతాళానికి అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు అధిక లాభాల కోసమే ప్రభుత్వాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ అమలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ల పక్షాన పని చేస్తున్నాయని ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి యావత్ కార్మికవర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేయడానికి సిఐటియు రాష్ట్ర మహాసభలో చర్చించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరావు, అరబిందో ఫార్మా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.గురునాయుడు, నాయకులు జె.శ్యామలరావు, ఎల్.రాంబాబు, యుబి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఐ.నారాయణరావు, జె.గంగరాజు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మి, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, గొర్లె కృష్ణ, వి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఒక్క పెన్షన్ పోయినా ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి
- నగరపాలక సంస్థ ఎదుట టిడిపి నిరసన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఒక్క పెన్షన్ పోయినా వారి తరపున టిడిపి ఉద్యమిస్తుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా పెన్షన్ల తొలగింపునకు సిద్ధమవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో పెన్షన్లు రద్దు చేసి కొత్త సంవత్సరం కానుకగా ఇచ్చారంటూ శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యాన గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడిట్ పేరుతో అర్హుల పింఛను తొలగించడానికి జరుగుతున్న కుట్రను ఆపాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ రోజుకో విధానాన్ని తీసుకొచ్చి పెన్షన్లపై కోత విధిస్తున్నారని అన్నారు. మూడున్నరేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు ఇప్పటికిప్పుడు ధనవంతులయ్యారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నగరంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపుదల చేస్తున్నామని చెబుతూ ఉన్న పెన్షన్ల సర్దుబాటు చేసేందుకే కోతలు పెడుతున్నారని ఆరోపించారు. కుట్ర పూరిత విధానాన్ని ప్రజలు గమనించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కమిషనరు చల్లా ఒబులేసును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, రాష్ట్ర బిసి ఉపాధ్యక్షులు శిల్ల శ్రీను, జామి భీమశంకర్, టి.వెంకన్నయాదవ్, ఇప్పిలి తిరుమలరావు, విజయరాం, గుత్తు చిన్నారావు, వెంకటరామరాజు, బి.గుప్తా, కె.శ్రీనివాస్, జి.కోటేశ్వరరావు, వెంకటరావు, బి.ప్రసాద్, కేశవ రాంబాబు, ఎం.రాజు, కె.కమల, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ప్రమాదాలు నేరాలు

ఒకవైపు సాంకేతిక పరిజ్ఞానం, మరో వైపు పోలీసుల నిఘా వెరసి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రయత్నాలు ఫలించాయి. జిల్లాలో నేరాలతో పాటు, ప్రమాదాలు కూడా పెరిగాయి. అయితే ఆన్‌లైన్ మోసాలతో పాటు చోరీలు గతంలో కంటే పెరిగాయి. మహిళలపై దాడులు పెరిగాయి. అత్యాచారాలు, ఆత్మహత్యలు మాత్రం గతం మాదిరిగానే కొనసాగుతున్నాయి. దొంగతనాల రికవరీ ఆశించినంతగా లేదు. గంజాయి, గుట్కా రవాణా, హత్యలు కొనసాగాయి.

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఏడాది పొడవునా జిల్లాలో నేర నియంత్రణలో పోలీసింగ్ మంచి ఫలితాలను సాధించింది. సాంకేతిక సహకారాన్ని అందిపుచ్చుకున్న పోలీసులు నిందితులను సకాలంలో పట్టుకోగలిగారు. ఈ ఏడాది నగరంలోని పాత ఆర్‌టిఒ కార్యాలయం రోడ్డులో ఓ రియల్టరుపై రివాల్వర్‌తో కాల్పులు జరపడం సంచలనం సృష్టించింది. ఈ కాల్పుల్లో రియల్టరు వెంకటరమణ త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ కాల్పుల ఘటనలో నిందితులను పది రోజుల్లో పోలీసులు అరెస్టు చేయగలిగారు. నగరంలోని గూనపాలెంలో వాలంటీరుగా పనిచేస్తున్న మరో యువకునిపై గంజాయి సేవించిన కొందరు యువకులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. హత్య జరిగిన తర్వాత ఇతర రాష్ట్రాలకు పారిపోతున్న నిందితులను సాంకేతికత ఆధారంగా అప్రమత్తమై సకాలంలో పట్టు కోగలిగారు. ఈ ఏడాది నవంబరులో గార వైస్ ఎంపిపి బరాటం రామశేషును ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. ఈ కేసులోనూ పురోగతి సాధించిన పోలీసులు 10 రోజుల వ్యవధిలోనే నిందితులను పట్టు కోగలిగారు. జిల్లాలో ఈఏడాది సంచలనం సృష్టించిన ఈ మూడు కేసుల్లో పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించడం వల్ల సకాలంలో కేసుల్లో పురోగతి సాధ్యమైంది. ఎచ్చెర్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గతేడాది 6,637 నేరాలు నమోదు కాగా ఈ ఏడాది 6,719 నమోదయ్యాయి. 2021 డిసెంబరు నాటికి 4,265 పెండింగ్ కేసులతో కలుపుకొని ఈ నెల 28 వరకు నమోదైన మొత్తం 10,984 కేసుల్లో 7,550 కేసులు విచారణ పూర్తి చేశారు. మిగతా 3,430 కేసులు పెండింగులో కొనసాగుతున్నాయి. మరో వైపు గతంలో నమోదైన కేసుల్లో రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లో 3,523 కేసులను పరిష్కరించారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది 2922 కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడ్డాయి.

జోరందుకున్న దొంగతనాలు

జిల్లాలో దొంగతనాలు పెరిగాయి. 2021లో 224 కేసులు నమోదయ్యాయి. 2022లో 247 కేసులు నమోదు కాగా అందులో 124 కేసుల్లో రికవరీ చేయగలిగారు. ఈ కేసుల్లో చైన్ స్నాచింగ్ ముఠా పట్టుబడ్డారు. మూడు సార్లు వివిధ ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు రూ.లక్షల్లో నగదు, బంగారం, బైక్‌లు, సెల్ ఫోన్లను స్వాధీన పరచుకున్నారు. జిల్లాలోనేకాక ఇతర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడే ఈ ముఠా సభ్యులను అరెస్టు చేశారు. జిల్లాలో అట్రాసిటీ కేసులు 58 నమోదయ్యాయి. గత ఏడాది కంటే ఈ కేసులు తగ్గు ముఖం పట్టాయి.

పెరిగిన చీటింగ్ కేసులు

జిల్లాలో ఈఏడాది చీటింగ్ కేసుల సంఖ్య ఘననీయంగా పెరిగింది. వైట్ కాలర్ నేరాలుగా చెప్పబడే సైబర్ క్రైం, చీటింగ్ కేసులు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 233 కేసులు నమోదయ్యాయి. గేమింగ్ యాక్ట్ కింద 203 కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈఏడాది కొత్తగా 38 మందిపై రౌడీషీటర్ తెరిచారు. నాటుసారా, మద్యం, నిషేధిత మత్తుపదార్థాలు రవాణా వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో బాగంగా 2116 కేసులు నమోదు చేసి 1635 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 121 వాహనాలు సీజ్ చేశారు.

మహిళలపై పెరిగిన దాడులు

జిల్లాలో డొమస్టిక్ వైలెన్స్, వరకట్నపు వేధింపులు, లైంగిక వేధింపులు వంటి కేసుల సంఖ్య పెరిగింది. దీంతో మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ఈ ఏడాది 498 కేసులు నమోదయ్యాయి. చిన్నపిల్లలపై అసభ్య ప్రవర్తన లైంగిక వేధింపులకు సంబంధించి పోక్సో చట్టం కింద 43 కేసులు నమోదయ్యాయి. అయితే గతం కంటే ఈ కేసుల సంఖ్య కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన దిశ చట్టం అమలులో భాగంగా దిశ యాప్‌ను 10.35లక్షల మహిళల మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేయించారు. ఈ యాప్ ద్వారా 438 కాల్స్ రాగా 34 ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

పెరిగిన మిస్సింగ్ కేసులు

జిల్లాలో ఈ ఏడాది 490 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. పాత మిస్సింగ్ కేసులు పెండింగ్‌లోనే కొనసాగుతున్నా కొత్తగా నమోదైన కేసుల్లో సాంకేతిక ఆధారంగా పురోగతి సాధించగలిగారు. ఫలితంగా 390 కేసుల్లో పురోగతి సాదించారు.

సిసి కెమెరాలతో మంచి ఫలితాలు

జిల్లాలో నేరాలను అదుపు చేయడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో 994 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా నేరస్తులను సకాలంలో గుర్తించడానికి వీలవుతోంది. నేరం జరిగిన ప్రదేశంలో ఏదో ఒక చోట కెమెరా అందుబాటులో ఉంటే నేరస్తులను గుర్తించడం ద్వారా పట్టుకునేందుకు దోహదపడుతోంది. జిల్లాలో ప్రస్తుతం పురోగతి సాధించిన అనేక కేసుల్లో ఈ కెమెరాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో ఈ ఏడాది 788 ప్రమాదాలు సంభవిస్తే 263 మంది మృతి చెందారు. 993 మంది గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు విజువల్ పోలీసింగ్, అపరాధ రుసం వసూలు, వేగ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై 1,51,088 ఈ-చలానాలు విధించి రూ.3,85,20,820లు అపరాధ రుసుం విధిస్తే ఇందులో 43,656 ఈ-చలానాలు నుంచి రూ.1,16,49,045లు వసూలైంది.

క్యాంపస్ కాప్‌తో సత్ఫలితాలు

ర్యాగింగ్, మహిళలు, విద్యార్థులపై అసభ్య ప్రవర్తనను నిరోధించడానికి సరికొత్తగా క్యాంపస్ కాప్ కార్యక్రమాన్ని ఈ ఏడాది జులై 9న ప్రారంభించారు. విద్యార్థులను కాప్‌లో భాగస్వాములుగా ఎంపిక చేయడం వల్ల 16 కాలేజీల్లో 291 మంది విద్యార్థులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు పోలీసులు ప్రజల్లో భాగమే అన్న నమ్మకాన్ని పెంచడానికి చిన్నారికి చేదోడు పేరుతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నివారణకు ఇది దోహదపడుతోంది.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

డ్వామా పీడీ జివి.చిట్టిరాజు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో ఉన్న ఉపాది హామీ పథకం కార్యాలయాల్లో పెండింగ్ పనులు, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డ్వామా పీడీ జివి.చిట్టిరాజు ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎపిఒలు, ఈసిలు, టిసి, ఎఫ్‌సి, ఎపిడిలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లోనూ వివిధ సాంకేతిక కారణాల వల్ల కొందరు కూలీలకు కూలి వారి బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదని, వీటిని స్పెషల్ డ్రైవ్ చేపట్టి సాయంత్రంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. జాబ్ కార్డ్‌తో పాటు లబ్ధిదారుడి బ్యాంకు అకౌంటుకు ఆధార్ కార్డు అనుసంధానం చేసే కార్యక్రమాన్ని తక్షణం పూర్తి చేయాలన్నారు. ఈ విషయమే పదేపదే సిబ్బందిని పలుమార్లు ఆదేశించినప్పటికీ స్పందించకపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్ ఇచ్చిన వారు మాత్రమే పనికి రావాలని, ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశం ఫోటోలు పంపించాలన్నారు. గరిష్ట వేతనం రూ. 257 వచ్చే విధంగా పనులు చేపట్టాలని, ఇందులో రాజీ లేదన్నారు. 75శాతం జాబ్ కార్డుదారులకు 100 రోజులు ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. ప్లాంటేషన్ పనుల్లో భాగంగా పోయిన మొక్కలు స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తిచేసి జనవరి 5వ తేదీ లోపు అందుకు సంబంధించిన ఫోటోలను పంపించాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయిలో వచ్చిన సమస్యలను మండలాల్లోనే పరిష్కరించాలని, జిల్లా స్థాయి వరకు వాటిని రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మండల స్థాయి సిబ్బందిదేనని అన్నారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపారాణి, సూపరింటెండెంట్ ఎం.రవికుమార్, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు, కిరణ్, మన్మథరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రీసర్వే వేగవంతం

సిసిఎల్‌ఎ జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కొనసాగుతున్న భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వేపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ మొదటి దశ రీసర్వే దాదాపుగా పూర్తి కానున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ కావడం వల్ల కొన్ని చోట్ల డ్రోన్లతో సర్వేకి ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటిని అధిగమించి వరి కోతల అనంతరం ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన గ్రామాలను మండలాల వారీగా గుర్తించి సర్వేను పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విభాగాల వారీగా సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని వివిధ విభాగాల సమన్వయంతో సర్వే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని వివరించారు. సాంకేతిక పరమైన ఇబ్బందులను అధిగ మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి ఎం.నవీన్, డిఆర్‌ఒ ఎం.రాజేశ్వరి, భూసర్వే, రికార్డుల శాఖ ఎడి కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఇదేం ఖర్మ

వాలంటీర్ల సదస్సులో మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు అధికారం కోసం అడ్డదారుల్లో ప్రభుత్వంపై విషం చల్లుతున్నారని, ఆయనకు ఇదేం ఖర్మ అని విష ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నియోజకవర్గ సమన్వయకర్త డివిజి శంకరరావు ఆధ్వర్యాన వైసిపి సమన్వయ కర్తలు, వాలంటీర్లతో సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎవరి ప్రమేయం లేకుండా ప్రతి కుటుంబానికీ నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో నేరుగా వాలంటీర్లు, సమన్వయకర్తలు కలిసి మాట్లాడి వారి అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాలకు అన్యాయం చేసి అమరావతిని అభివృద్ధి చేస్తానని చెపుతున్నారని, దీనివల్ల తిరిగి వెనుకబడ్డ శ్రీకాకుళం జిల్లాకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్దానం ప్రాంతానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రూ.700 కోట్లతో పనులు చేపడుతున్నామని, పలాసలో కిడ్నీ రోగులకు రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రూ.3వేల కోట్లతో భావనపాడులో పోర్టు నిర్మాణం చేపడుతున్నామన్నారు. బుడగట్ల పాలెంలో రూ.300 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గొట్టా దగ్గర రూ.180 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి మండు వేసవిలో సైతం జిల్లా రైతాంగానికి నీరు అందించనున్నామన్నారు. ఇవన్నీ ప్రజలకు ఇంటింటికీ వెళ్లి చెప్పాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉందన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు రామ్‌మనోహర్‌నాయుడు, శ్రీకాకుళం, గార ఎంపిపిలు గొండు రఘురాం, శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మూకళ్ల తాతబాబు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM

E.P.No.10/2016 in ARC No.242/2013

BETWEEN:
Shriram City Union Finance Ltd. Srikakulam - I Branch ...DHR/ Petitioner
AND
Killi Sarada Kumari & Anothers ...JDRS / Respondents

JDR 1 : Killi Sarada Kumari, W/o Lakshmana Rao, R/o D.No.5-3-41, Krishnapuram Village, Amadalavalasa Mandal, Srikakulam District.

JDR 2 : Killi Seshu Mohan Appalanaidu, S/o Lakshmana Rao, R/o D.No.5-3-41, Krishnapuram Village, Amadalavalasa Mandal, Srikakulam District.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు అవార్డు అమలులో సొమ్ము రాబట్టే నిమిత్తం పైన ఉదహరించిన న్యాయస్థానంలో తేది 19-01-2023 ఉ॥ గం॥ 10-30 ని॥ల నుండి సా॥ 5 గం॥ల మధ్యకాలంలో బహిరంగంగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.

వేలం ఆస్తి వివరములు :

Amadalavalasa Village and Mandalam, Amadalavalasa Sub-Registrar, Srikakulam District, Ward, Block D.No.5-3-41, Survey No.18/1, 900 Sq.ft. **East** : House of Suri Satyam, **West** : House of Bala Ramakrishna Rao, **South** : Road, **North** : Site of extent cents Killi Brunda Kumari @ Sarada Kumari.

DHR value : 7,25,212/- Amine Value : Rs.30,00,000/- hearing date : 19-01-2023, further hearing date 27-01-2023.

MANCHU JANARDHANA RAO, Advocate
Jami Thota, Visakha 'A' Colony, Srikakulam Town & Dist.
Phone : 9849178948, 9704986271
9849824246, 9676402714

ఎంపికైన ఎన్‌సిసి క్యాడెట్లు

గణతంత్ర వేడుకలకు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు దేశ రాజధాని ఢిల్లీలో 2023 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో హాజరయ్యేందుకు అవకాశాన్ని దక్కించుకున్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఆర్మీ విభాగంలో ఎంపికైన ఎన్‌సిసి క్యాడేట్స్ చంద్రశేఖర్, సాయికుమార్, చైతన్యలకు ఈ అవకాశం దక్కింది. కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ వై.పోలినాయుడు నేతృత్వంలో వీరు శిక్షణ పొందుతూ ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. 14 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి శిక్షణలో మూడు జిల్లాల తరపున ప్రాతినిధ్యం వహిస్తూ విశాఖపట్నం గ్రూపులో ఆర్మీ విభాగంలో వీరు ఎంపికయ్యారు. క్రమశిక్షణ గల వీరు దేహదారుఢ్య పరీక్షలు, డ్రిల్స్‌లో మంచి నేర్పరితనం చూపించడం వల్లే ఈ అవకాశం దక్కిందని పోలినాయుడు తెలిపారు.

కందుకూరు మృతులకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో చంద్రబాబు సభలో ఎనిమిది మృతి చెందారు. ఈ మేరకు నగరంలో టిడిపి కార్యాక్రమంలో మృతుల చిత్రపటానికి ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్ని నాగార్జున ప్రతాప్, బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిల్లా శ్రీనివాసరావు, చిట్టి మోహన్, తోనంగి వెంకన్నయాదవ్, జిల్లా కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు, దుంగ భాస్కర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుల చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- కవిటి

విద్యకు సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ఆర్.బెలగాం జిల్లా పరిషత్, రాజపురం ఎపి మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల పిల్లల విద్య కోసం ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధను గుర్తించి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. నాడు-నేడు అనే ఒక బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని అన్నారు. ఇంగ్లీష్ మీడియం చదువుతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అలాగే మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ట్యాబ్‌ను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్‌సాహు, సర్పంచ్ లలితా సాహు పాల్గొన్నారు. అదేవిధంగా కపాసుకుద్ది పంచాయతీ ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సర్పంచ్ కాయ దమయంతి భీమసేన్, మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, బెలగాం సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, రాజపురం సర్పంచ్ సనపల జానకిరావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని ధర్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా బోధన లో మరిన్ని మెలకువలు తెలుసుకొని మంచి ఫలితాలు సాధించాన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహనరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే పురపాలక సంఘ పరిధిలో రత్తకన్న పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బి.వి.పావనికుమారి అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాడి ఆదిరెడ్డి, జగన్నాయకులు, బొబ్బలి భూదేవి, కౌన్సిలర్ ప్రతినిధి నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, సర్పంచ్ కోరికాన సీతారామ రాజు, ప్రధానోపాధ్యాయులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని జర్జంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ అన్నెపు సుశీల అధ్యక్షతన విద్యార్థులకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు తులసీబాయ్, అన్నెపు రామారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంఇఒ సిహెచ్.గోవిందరావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి, తోలాపి, తాడివలస, పిల్లలవలస, దల్లవలస గ్రామాల్లోని పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్‌లు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.వి.రామరాజు, విద్యా పర్యవేక్షకులు గురుగుబెల్లి శ్యామలరావు, సర్పంచ్ పైడి రాంప్రసాదారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి నాయకులు కిల్లాన సూర్యారావు, బాడాన వెంకటకృష్ణ, కొంచాడ గిరిబాబు, ప్రధానోపాధ్యాయులు

సంతబొమ్మాళి : మండలంలోని నరసాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన టాబ్‌లను సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డోక్కరి మల్లేష్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు నూకరాజు, మురళి పాల్గొన్నారు.

పొందూరు : ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి ఉషారాణి

కవిటి : ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

సంతబొమ్మాళి : ట్యాబ్‌లతో విద్యార్థులు

బూర్జ : ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి దీప

సమర్థతతో నేరాల అదుపు

ఎస్‌పి జి.ఆర్.రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది నేరాలు సంఖ్య పెరిగిందని, కానీ, నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో మంచి ఫలితాలు సాధించామని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వార్షిక నివేదికలను గురువారం విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడంలో పోలీసు సిబ్బంది ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకుని సమర్థవంతమైన పోలిసింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేరాలతో పాటు మత్తు పదార్థాల వినియోగం, పేకాట నియంత్రణా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాస్థాయిలో మోనటరింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ రహదారితో పాటు ఇతర రోడ్లలో ప్రయాణించే వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటించిన వాహనదారులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి ఇ-చలానాలు వసూలు చేస్తున్నామన్నారు. ప్రజల సహకారం ఉంటే తప్ప పోలిసింగ్ సాధ్యం కాదన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నేరాల అదుపునకు తోడ్పాటు అందివ్వాలని పిలుపునిచ్చారు. పోలీస్ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలకు ఆంక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. సంక్రాంతి కారణంగా నగరంలోని జిటి రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కరోనా కొత్త వేరియంట్ విస్తరిస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హెచ్చరికలు నేపథ్యంలో ఎవరికి వారే స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. సమావేశంలో డిఎస్‌పిలు మహేంద్ర, శివరాంరెడ్డి, ప్రసాద్, సిఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్.రాధిక

మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య పద్మావతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని బొడ్డేపల్లిపేట-కొర్లకోట రహదారిలో ఉన్న ఓ డాబా దగ్గరలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కొర్లకోటకు చెందిన గురుగుబెల్లి చక్రధర్‌రావు (42) ఆమదాలవలస పట్టణంలో వ్యక్తిగత పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో అటువైపు నుంచి పట్టణానికి వస్తున్న చీమలవలసకు చెందిన పైడి బాలకృష్ణ ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలతో బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చక్రధర్‌రావు కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై ప్రమాద స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఘునాధరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. హెల్మట్ ధరించి ఉంటే చక్రధర్‌రావు మృతి చెంది ఉండేవాడు కాదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- నందిగాం

మండలం దిమిలాడ పంచాయతీకి చెందిన పామోటి కృష్ణారావు (38) మద్యంలో సూపర్ వాస్మల్‌ను కలిపి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... కృష్ణారావు మద్యానికి బానిసై రోజూ తాగి భార్యతో గొడవ పడేవాడు. బుధవారమూ బాగా తాగడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై తనతో తెచ్చుకున్న మద్యంలో ఇంట్లో ఉన్న సూపర్ వాస్మల్‌ను కలిసి తాగేశారు. కొద్ది సేపటి తరువాత అపస్మారస్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి కుమారుడు మణికంఠ, కుమార్తె మనీష ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సి రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కార్యకర్తల కనుసన్నల్లో పనిచేయాలి

ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- లావేరు

పంచాయతీల కన్వీనర్లు, వాలంటీర్లు వైసిపి కార్యకర్తలు కనుసన్నల్లోనే పనిచేయాలని, దానికి విరుద్ధంగా పనిచేస్తే అటువంటి వారిని తొలగిస్తామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మూడేళ్లలో ఎవరికీ సంక్షేమ పథకాలు ఆపమని వాలంటీర్లు చెప్పలేదని అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, లావేరు పిఎసిఎస్ అధ్యక్షుడు బూరడా చిన్నారావు, మాజీ ఎంపిపి డి.రాజినాయుడు, గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నౌపడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లతో, కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని 20 సచివాలయ పరిధిలో ఒక్కో సచివాలయానికి ముగ్గురు చొప్పున 60 మంది కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మూడున్నర ఏళ్లలో మండలంలో రూ.400 కోట్ల పైబడితో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికీ అందజేశామని తెలిపారు. రూ.4 వేల కోట్లతో పోర్టు నిర్మిస్తున్నామని తెలిపారు.

టిడిపిపై విమర్శలు

బుధవారం కందుకూరులో టిడిపి ఇదేం కర్మ రాష్ట్రానికి నిర్వహించిన కార్యక్రమంపై దువ్వాడ తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబుకు ప్రచారం ఇరుకు రోడ్లపై నిర్వహించి ఎనిమిది మంది నిండు ప్రాణాలు బలిగొన్నారని ఆరోపించారు. అచ్చెన్నాయుడు ఎమ్మెల్యేగా ఉండడం టెక్కలి నియోజకవర్గం దురదృష్టమని విమర్శించారు. 40 ఏళ్లగా వారి కుటుంబం రాజకీయాలు చేస్తున్నా ఒక్కసారైనా ఇంటింటికీ తిరిగారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి, జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెళ్లి జగన్నాయకులు, వైసిపి మండల కన్వీనర్ కోత సతీష్, వైసిపి నాయకులు మేరుగు అప్పారావు, నక్క భీమారావు, ఎన్ని మన్మథరావు, అప్పారావు, మోహన్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, నాగభూషణరావు పాల్గొన్నారు.

నౌపడ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయంలో కన్వీనర్లకు, వాలంటీర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణ, కవిటి రామరాజు పాల్గొన్నారు.

ప్రజా సేవకులు కన్వీనర్లు

టెక్కలి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యంగా కన్వీనర్లుగా పనిచేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం ఆవరణంలో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షులు మాధురి, చింతాడ మంజు గణపతిరావు, ఎంపిపి అట్లా జరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, వైసిపి మండల అధ్యక్షులు బగాది హరి పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీకి
ఐతమ్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ ఏడాది సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న ఎస్.సాయి భగవత్ జనవరి 2 నుంచి పదో తేదీ వరకు హర్యానా రూతల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని పిఎస్విఎంఆర్ కాలేజీలో యూనివర్శిటీ స్థాయిలో జెఎన్టియు కాకినాడ ఇటీవల నిర్వహించిన 75-80 కేజీల విభాగంలో సాయి భగవత్ పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఒడి డాక్టర్ పి.దినకర్ డాక్టర్ పి.వి.మురళీధర్, పిడిలు ఎస్.లక్ష్మణ మూర్తి, టి.మురళీమోహన్, జె.తేజశ్వరిలు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

వేతన సవరణ చేయాలని ఆర్‌డిఒకు వినతి

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- పలాస

రైస్ మిల్లు కార్మికుల వేతన సవరణ కోసం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యజమానులు చట్టపరంగా ఎటువంటి హక్కులను అమలు చేయడం లేదని, కూలీ రేట్లు కూడా సరైన రీతిలో పెంచడం లేదని తెలిపారు. ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు వేతనాలు పెంచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, బోనస్, గ్రాడ్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 20 రోజులుగా రైస్ మిల్లు కార్మికులు ఆందోళన చేస్తున్నారన్నారు. 2022 మార్చి నాటికి గడువు పూర్తయినా యాజమాన్యాలు చర్చలకు సహకరించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మందస మండల కమిటీ కార్యదర్శి కె.కేశవరావు, యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, కె.కృష్ణారావు, ఎం.ధర్మారావు, బి.మల్లేసు, పి.కూర్మారావు, ఎన్.లచ్చయ్య పాల్గొన్నారు.

రేపు జిల్లా జట్టు ఎంపిక

పలాస : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహిస్తున్నామని టెన్నీకాయిట్ సంఘం జిల్లా కార్యదర్శి పి.తవిటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు 1.4.2008 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. జనన, ఆధార్ ధ్రువీకరణ పత్రాలను తమతో తీసుకురావాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని జిల్లా యాదవ సాధికారిత ప్రతినిధుల బృందం కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను గురువారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్, సాలిన ఢిల్లీరావు యాదవ్, కొర్రాయి వాసుయాదవ్, పత్తిరి తవిటయ్య యాదవ్, ఆనంద్ యాదవ్, బంగారు శివయాదవ్, పిట్ట నరసింహమూర్తి యాదవ్, మామిడి తాతారావు యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యాదవులు

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

మెళియాపుట్టి : మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ధాన్యం దించుకోవడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగజేయకూడదని తహశీల్దార్ పి.సరోజిని, ఎఒ దానకర్ణుడు సూచించారు. మండలంలోని చాపర రైతు భరోసా కేంద్రం పరిధిలోని కృష్ణ కామాక్షి మోడ్రన్ రైస్ మిల్లును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నాణ్యత గల ధాన్యం అందుబాటులో ఉన్నాయని అన్నారు. మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులకు సహకరించాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల యాజమాన్లు మిల్లుల బ్యాంకు గ్యారంటీనీ పెంచాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో పరీక్షించిన ధాన్యం మాత్రమే ప్రాతిపదిగా తీసుకొని మిల్లులో దించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ వాసునాయుడు, విఆర్ఒ అన్నాజీరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పల్లవి పాల్గొన్నారు.

జలుమూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు వచ్చిన ధాన్యానికి రైస్ మిల్లర్లు ఎకనాలెడ్జిమెంట్ వెంటనే ఇవ్వాలని తహశీల్దార్ బి.సత్యం మిల్లర్ల యజమానులకు ఆదేశించారు. మండలంలోని పలు రైస్ మిల్లులను గురువారం సందర్శించి తనిఖీ చేశారు. తాము తీసుకున్న ధాన్యానికి క్వింటాకు 67 శాతం సిఎంఆర్ బియ్యం ఎఫ్‌సికి పంపించాలని సూచించారు. ఈయనతో పాటు ఎఒ కె.సురేష్, డిటి పి.శ్రీనివాస్, సిఎస్ డిటి బి.గణేష్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

సదస్సును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక కమల కళ్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నూతనంగా ఎన్నికైన సచివాలయ కన్వీనర్లకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పరిశీలకులుగా ఎమ్మెల్సీ పి.వి.సూర్యనారాయణరాజు పాల్గొంటారని చెప్పారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈయన వెంట జెడ్‌పిటిసి జి.ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, పిఎసిఎస్ అధ్యక్షులు యు.బాలరాజు ఉన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు
సమస్యలపై స్పందన

జలుమూరు: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సమస్యలపై శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బి.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే స్పందనలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ స్పందన కార్యక్రమం సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

ఇన్నోవా హైక్రాస్ ధరను ప్రకటించిన టయోటా

శ్రీకాకుళం: అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న తమ నూతన ఇన్నోవా హైక్రాస్ ధరను టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) వెల్లడించింది. అన్ని గ్రేడ్‌లకూ భారతదేశ వ్యాప్తంగా ఒకే ధరలు వర్తిస్తాయని, ప్లాటినం పెరల్ వైట్ కలర్‌కు అదనపు ప్రీమియం వర్తిస్తుందని పెద్దపాడు రోడ్డులో ఉన్న లీలా కృష్ణ టయోటా షోరూంలో వర్చ్యువల్ సమావేశంలో టికెఎం సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు. టయోటా విడుదల చేసిన ఈ నూతన వాహనం రూ.18,30,000 నుంచి రూ.28,97,000 (ఎక్స్‌షోరూమ్)లో లభిస్తుందని చెప్పారు. టయోటా ఈ సరికొత్త కారును నవంబర్ 2022న విడుదల చేశారని, బుకింగ్స్ ప్రారంభించినట్లు తెలిపారు.



టయోటా కారు

'కాకినాడ ఆదిత్య'లో ఎలక్ట్రానికల్ 2కె22

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యాన ఎలక్ట్రానికల్ 2కె22 ఫెస్ట్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆముదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎలక్ట్రానిక్స్ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగం కూడా ఎన్నో విధాలుగా మార్పు చెందిందన్నారు. చక్రవర్తి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ రంగంలో ఎన్నో అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక బయటకు తీయడానికి దోహదపడతాయన్నారు. భవిష్యత్ అంతా ఎలక్ట్రానిక్స్‌పై ఆదారపడి ఉంటుందన్నారు. ఫెస్ట్‌లో పిపిటి, టెక్నికల్ క్విజ్, పోస్టర్ ప్రెసెంటేషన్, ప్రాజెక్టు పోటీల్లో పాల్గొవడానికి వివిధ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం శ్రీనివాసరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకట అప్పారావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి పి.సంతోష్, ల్యాబ్ ఇన్‌ఛార్జి పి.శ్రీనివాసరావు, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెమొంటోను అందజేస్తున్న శ్రీనివాసరావు

పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీతులసీ

104 సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీతులసీ అన్నారు. మండలంలోని రాపాకలోని హెల్త్‌వెల్‌నెస్ కేంద్రంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యులు ప్రజల వద్దకే వెళ్లి సేవలను అందించడంతో పాటు బిపి, సుగర్ పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి మందులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ ఆదిమణికంఠ, ఎఎన్ఎంలు ఉదయలక్ష్మి, వనజాక్షి, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, హెల్త్ అసిస్టెంట్ రమణ, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాజేశ్వరి, ఉషారాణి, పుణ్యవతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ చలమయ్య

రైల్వేలైన్ ఏర్పాటుకు భూములు ఇవ్వాలి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మించనున్న భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన రైల్వేలైన్ ఏర్పాటుకు భూములు అప్పగించాలని తహశీల్దార్ చలమయ్య గురువారం రైతులను కోరారు. నౌపడ పంచాయతీ కూర్మనాథపురంలో గ్రామస్తులు రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు నిర్మాణ ప్రాంతం నుంచి కూర్మనాథపురం, యామాలపేట గ్రామాల పొలాలు మీదుగా దండు గోపాలపురం వరకు రైల్వేలైన్‌ను ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. దీని నిర్మాణానికి సేకరించనున్న వ్యవసాయ భూముల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్‌లో వెలువరించిందన్నారు. నోటిఫికేషన్ ప్రకారం రైతుల భూములు ఇచ్చి సహకరించాలని కోరారు. ప్రభుత్వం మెరుగైన నష్టపరిహారం అందిస్తుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సుధాకర్, వైస్ సర్పంచ్ వాడరేవు రవికుమార్ పాల్గొన్నారు.

సిపిఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కె.టి.రోడ్డులో సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ పతాకాన్ని పలాస నియోజకవర్గ నాయకులు చాపర వేణుగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రద్యమ కాలం నుంచి ఇప్పటి వరకు బడుగు, బలహీన వర్గాల కోసం కార్మికులు, రైతులు కోసం అణచివేతకు వ్యతిరేకంగా పాలక వర్గాలతో నిరంతరం పోరాడి హక్కులు సాధించుకున్న పార్టీగా నిలిచిందన్నారు. సిపిఐ పలాస నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తుందన్నారు. సూదికొండ, ఇందిరా కాలనీ శాఖలలో కూడా జెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చాపర సుందర్‌లాల్, మండల కార్యదర్శి మున్నా, సుందరరావు, చిన్నా, శ్రీనివాస్ గోవింద్, భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి దివ్య

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

బూర్జ: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపిపి కర్నేన దీప అన్నారు. బూర్జ మండల పరిషత్ సమావేశ మందిరంలో గుతావల్లి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రి మరమ్మతులకు, అవసరమైన సామగ్రికి నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, ఎంపిడిఒ రవీంద్ర, తహశీల్దార్ రమణారావు, పిహెచ్‌సి డాక్టర్ రమ్యశ్రీ, సర్పంచ్‌లు హనుమంతు మీనాక్షి, మెట్ట సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బూర్జ

ఉపాధి హామీ కూలీలకు కనీస కూలి వచ్చేలా మస్తర్లు వేయాలని ఎంపిపి కర్నేన దీప అన్నారు. మండలంలోని కొత్తవలసలో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు శ్రమకు తగ్గిన ఫలితం వచ్చేలా చూడాలని, ప్రతి కుటుంబానికీ వంద రోజులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జల్లు అప్పలస్వామినాయుడు, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాం నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ ముడిల అప్పలస్వామి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అసత్యప్రచారం

రెవెన్యూశాఖా మంత్రి ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్ : వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రజల కష్టాలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారని, కానీ, సంక్షేమ పథకాల అమలుపై టిడిపి అసత్య ప్రచారం చేస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని దండివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సాగుతున్న ప్రచారంలో వాస్తవాలను ప్రజలు గమనించాలన్నారు. పథకాల అమలులో ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఇచ్చిన మాట ప్రకారం హామీలు అన్నీ అమలు చేస్తున్నామని అన్నారు. నాణ్యమైన విద్యను అందించాలన్న ప్రయత్నంలో భాగంగా స్కూళ్ల రూపురేఖలను మార్చామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేస, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, ఎన్ని ధనుంజయ్, మహాలక్ష్మి, గాయత్రి, ఆశాదీపిక పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

వజ్రపుకొత్తూరు : మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని మంచినీళ్లపేటలో వంక సత్యరాజులు అధ్యక్షతన, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వంక రాజు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. మత్స్యకార భరోసా కింద ఏటా రూ.పది వేలు చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు సామాజిక పింఛన్ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జలుమూరు : కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పుక్కల గురయ్య నాయుడు పాల్గొన్నారు.

జలుమూరు: గ్రామాల్లో గుర్తించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, వైసిపి సిఇసి రాష్ట్ర మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. మండలంలోని జోనంకి సచివాలయం పరిధి దరివాడ పంచాయతీ పరిధిలోని ఎంపిపి వాన గోపి అధ్యక్షతన దరివాడ, ఊడికలపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మొజ్జాడ శ్యామలరావు, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్లు పొన్నాన ముసలినాయుడు, పాగోటి రాజప్పలనాయుడు, దరివాడ సర్పంచ్ పైడి విఠల్‌రావు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

అరాచకాలను సృష్టిస్తున్న వైసిపి ప్రభుత్వాని గద్దెదించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తుంగపేటలో సర్పంచ్ పప్పల వేణుగోపాలం అధ్యక్షతన గురువారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, పెంచిన నిత్యవసర సరుకుల దరలు, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపు వంటి వాటితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వైసిపి పాలనలో తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు ఆయన వద్ద వాపోయారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, టిడిపి నాయకులు కూన సత్యనారాయణ, గాడు నారాయణరావు, సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ కృష్ణవాసుదేవరావు, అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, వండాన మురళీ, వాసు, తవిటినాయుడు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని తామరగూడ, నాయుడు గూడ, చిరుగూడ, జన్నిగూడ, దిగువరాయి గూడ, ఇప్పగూడ గిరిజన గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యాక్రమాన్ని నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ పాత్రకొండ మోహనరావు, సర్పంచ్ నెల్లి అచ్యుత్, పాలకొండ సురేష్, పైల లక్ష్మణరావు, నగేష్, కెల్ల యాదవ్ పాల్గొన్నారు.

టెక్కలి : వైసిపి ప్రభుత్వం ప్రజాపాలనలో విఫలమైందని తెలుగు యువత రాష్ట్ర నాయకులు రెయ్యి ప్రీతీష్ చంద్ విమర్శించారు. స్థానిక రేవతీపతి వీధిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి లేకపోవడంతో యువత నిర్వీర్యం చెందుతున్నారన్నారు. జాబ్ క్యాలండర్ ప్రకటించకపోవడంతో యువకులు తమ అర్హతను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో పోలాకి చంద్రశేఖర్, దల్లి ప్రసాద్‌రెడ్డి, దివ్వల శ్యామలరావు, తవిటిబాబు పాల్గొన్నారు.

పొందూరు : ర్యాలీలో రవికుమార్, తదితరులు

శవ రాజకీయాలు వద్దు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

కందుకూరులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన బహిరంగ సభలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన తమను కలచివేసిందని, దీనిపై టిడిపి కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందుతుంటే మరోవైపు వైసిపి మంత్రులు, నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కందుకూరు ఘటనపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎంతో బాధపడ్డారని, మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.23 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని చెప్పారు. గాయాల పాలైన వారికి నష్ట పరిహారం చెల్లించడంతోపాటు వారికి పూర్తిగా నయం అయ్యే వరకు టిడిపి బాధ్యత తీసుకుంటుందన్నారు. ఘటనపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ జరిగిన ఘటనపై దుర్భాంతి వ్యక్తం చేయడంతో పాటు నష్టపరిహారం ప్రకటించారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఘటనపై కనీసం స్పందించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చంద్రబాబు జాతీయ స్థాయిలో ప్రచారాలు చేసుకోవడానికి, కుట్ర పన్ని ఎనిమిది మందిని బలి తీసుకున్నాడని చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి మానసిక స్థితి బాగులేకపోవడం వల్లే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్త, బి.నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, పి.మల్లేష్, ఎస్.నవీన్, పైల చక్రధర్ పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళలు జీవనోపాధులను మెరుగుపరచుకుంటూ ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను నిర్వహిస్తున్న వారికి సీడ్ క్యాపిటల్ కింద రూ.40 వేలు రుణం మంజూరు చేస్తున్నామని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలోని అవకాశాల గురించి శిక్షకుడు మోహన్ కుమార్ వివరించారు. ఇప్పటికే స్థాపించి ఉన్న యూనిట్లను అప్‌గ్రేడ్ చేయడానికి, కొత్త ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని స్థాపించడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాల గురించి రాయితీల గురించి ఎపిఎం వివరించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను బ్రాండింగ్, మార్కెటింగ్ చేయడానికి గల అవకాశాలను సూచించారు. కార్యక్రమంలో బూర్జ, ఎల్ఎన్‌పేట ఎపిఎంలు రాము, రవిరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు ధనలక్ష్మి, కోశాధికారి రేణుక, కార్యదర్శి వేణమ్మ, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలి రూలర్ : మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదిఆంధ్రావీధి సమీపంలో అదనంగా 5ఎంవి కెవి ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా 33/11 కెవి సబ్ స్టేషన్ టెక్కలి-2 పరిధిలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు విద్యుత్‌శాఖాధికారులకు సహకరించాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యమే సంపద

బూర్జ: ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలని, ఆరోగ్యమే మనకు ఆస్తి అని ఎ.పి.పేట సర్పంచ్ కొరికాన సీతారామరాజు అన్నారు. ఎ.పి.పేటలో రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ కరోనా వైరస్ సోకె ప్రమాదం ఉందని, గతంలో వలే మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని సూచించారు. వేడి నీళ్ల తాగుతూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జెమ్స్ వైద్యులు ప్రవీణ్ 58 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఆర్ఒ రాంబాబు, సోషల్ మీడియా దేవాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్

శాలివాహన సంఘం అభివృద్ధికి తోడ్పాటు

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- రణస్థలం

మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ,కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. దీనిపైన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హామీఇచ్చారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని శాలివాహన కుమ్మరులకు గ్రామ సచివాలయం కన్వీనర్లుగా ఇద్దరిని నియమించినందుకు పురుషోత్తం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ వింత శివనాగిరెడ్డి, వైసిపి నాయకులు మురళీధర్‌బాబా, శాలివాహన కుమ్మరి సంఘ సభ్యులు నాగవరపు సత్యం, వీరవరపు రమేష్, వీరవరపు సూర్యనారాయణ, నాగవరపు రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిప్రసాదరావు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణాశాఖ అధికారి హరిప్రసాదరావు సూచించారు. స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో రవాణాశాఖ అధ్వర్యాన రోడ్ భద్రతపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రహదారిపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్ రూల్స్‌పై వివరించారు. సిఐ సతీష్ కుమార్, టౌన్ ఎస్ఐ గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులు అతిథిగా విచ్చేసి 9,10,11 తరగతుల విద్యార్థులకు రోడ్డు భద్రత గురించి దృశ్యశ్రవణ కార్యక్రమాల ద్వారా పిల్లలకు చైతన్యపరిచారు. కార్యక్రమంలో విద్యా సంస్థలు కార్యదర్శి జోహార్‌ఖాన్, పాఠశాల ఎగ్జిక్యూటివ్ రమణమూర్తి, ఎఒ ప్రేమ్ సర్తజ్ ఖాన్, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, మేనేజర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేస్తున్న రాము

ఆధార్ డ్రైవ్‌కు స్పందన

జి.సిగడాం : మండలంలోని పెంట సచివాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ఆధార్ డ్రైవ్‌కు స్పందన లభించినట్లు ఆధార్ నిర్వాహకులు పొగిరి రాము తెలిపారు. ఆధార్ సంబంధిత సమస్యలను ఇక్కడ పరిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, మహిళలు, చిన్నారులు ఆధార్ అప్‌లోడ్, ఆధార్‌కు ఫోన్ నంబరు లింక్, పేర్లు, పుట్టిన రోజులు మార్పులకు అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పొట్నూరు సురేష్ కుమార్, నాగులువలస కార్యదర్శి చైతన్య, సచివాలయ సిబ్బంది సాకేటి ప్రసాద్, మనోజ్‌కుమార్, అనసూయ, మీసాల పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైతన్య

పెన్షనర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో 37 గ్రామ పంచాయతీల పరిధిలో 82 మందికి పైగా వివిధ కారణాలతో సామాజిక పింఛన్లు తొలగించారని, వారికి న్యాయం చేయాలని జనసేన పార్టీ పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య కోరారు. గురువారం ఎంపిడిఒ పి.చంద్రకుమారికి, తహశీల్దార్ సరోజనికి గురువారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామాల్లోకి వెళ్లి తొలగింపులకు గురైన లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో దుక్క బాలరాజు, రాజమోహన్, ఎస్.చంటి, పిట్ట హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరెడ్డి

కుళాయి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మేఘవరం పంచాయితీలో పాత మేఘవరం, చిధపానవానిపేట గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి కుళాయి పనులను సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేఘవరం ఎంపిటిసి సూరాడ రాజారావు, వైస్ సర్పంచ్ మంకు సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మెళియాపుట్టి : మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ గురువారం పరామర్శించారు. వెంకటాపురం, జలకలింగుపురం, చేపర గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, బి.దినకర్, గణపతి పాల్గొన్నారు.